



# ఔశికము

చింతచెట్టు కింద పడుకున్న సత్తిరెడ్డిగారి ఎడ్లడెక్కలు సాపుగా చెక్కి నాడాలేస్తున్నాడు తూర్పుకంసాలి. చెరుకుతోట మధ్యలో ఉన్న అమ్మోరి గుడి మూలల్లో బాగా నాచు పట్టేసుంది. జబ్బు చేసిన కుక్క పచ్చగడ్డి తింటుంది. గోదావరి కాలవలో ఉన్న పడవని ఎదురుగాలి అవడం వల్ల ముగ్గురు మగోళ్ళు తాడేసి లాగుతుంటే పడవలో ఉన్న ఆడమనిషి ఓ పక్కన చుక్కాని చూసుకుంటూ కూరొండుతుంది. ఆరారా అన్నంలో కలుపుకు తినేద్దాం అన్నంత కమ్మని వాసన. తట్టంచేపా వంకాయి ఇగురు.

పిచ్చితాతారెడ్డి షాపులో అద్దెకి తీసుకున్న సైకిల్ని తొక్కుకుంటూ వెళ్తున్న నేను ముచ్చుమిల్లిరేవుకి ఎడం పక్కనున్న రామచంద్రపురం వేపు తిప్పేను.



‘‘ఈవేళ చీకటి పడ్డ వెంటనే వచ్చెయ్యే’’ అంది మేరీకమల. దాంతో ఎప్పుడు చీకటి పడుద్దా ఎప్పుడు మేరీకమల్ని కలుస్తానా అని ఒకటే కంగారు ఒకటే గుండెదడ. ఏ పనీ ముట్టుకున్నా ఏదో గెలుకుతున్నానుగానీ మనస్ఫూర్తిగా చెయ్యలేకపోతున్నాను. ఈ ప్రపంచంలో ఒక్క మేరీకమల తప్ప. ఏదీ వద్దనిపిస్తుంది మనసుకి. అవును... కమల. పెద్ద పెద్ద కళ్ళతో చీకటి లాగ నల్లగా ఉండే మేరీకమల సుతిమెత్తని అడుగుల్తో ఈ ప్రపంచంలో ఎవర్నీ నొప్పించని మేరీకమల. ఆ మనిషి నన్ను ఇష్టపడ్డం నేను ముందు జన్మలో చేసుకున్న పుణ్యం.

అవును.

మూగమనసులు సినిమాలో సావిత్రీ, కొత్త దేవదాసు సినిమాలో జయంతీ అవేకళ్ళు సినిమాలో వెన్నిరాడైనిర్మలా సితార సినిమాలో భానుప్రియా ఈ నలుగురి ఫొటోలు కలగలిపితే మేరీకమల అవుద్ది. వయసులో నాకంటే పెద్దది మేరీకమల. రామచంద్రపురంలో శంకరనారాయణగారి హాస్పిటల్లో నర్సుగా పనిచేసేది.

నావయసప్పుడు పదహారు కూడా లేవు. వెంకటరత్నం రూము అక్కడ ఉండటంతో రోజంతా అక్కడే ఉండి ఏ అర్ధరాత్రి పూటో వెళ్ళేవాడ్ని పసలపూడి.

మేరీకమలకి ఎక్కువగా నైట్ డ్యూటీలు వేసేవారు ఆ హాస్పిటల్ వాళ్ళు. చాలా కష్టపడి పని చేసేది. రాత్రి పదింటికి వెళ్ళడం, తెల్లవారి ఆరింటికి రావడం. నేను పొద్దుట ఏడుగంటలకెళ్ళి కమలా అని పిల్చేవాడ్ని. ఆమె నవ్వుతా తలుపులు తీసేది. ఆకాస్త టైములోనే నేనూ నవ్వేవాడ్ని, నవ్వించేవాడ్ని, అలిగేవాడ్ని, శపించేవాడ్ని, ఏడిపించేవాడ్ని, అన్నిటికీ నవ్వుకునేది.

ఒకరోజు మంచం కింద ట్రంకు పెట్టె తెరిచి, బట్టలు కింద దాచిన మంగళసూత్రం బయటికి తీసి చూపించి చెప్పడం మొదలెట్టింది.

మా ఊరి పేరు కోట. కోటిపల్లి పక్కన గోదావరి గట్టు దిగువలో వుంది వూరు. తర్వాత ఈలి వాడపల్లిగారి హాస్టల్లో చదువుకున్నప్పుడు క్రిస్టియన్ మతాన్ని తీసుకున్నాను. నేను హాస్టల్లో వుండగానే కారు డ్రైవర్ చందర్రావు లవ్ చేసి పెళ్ళి చేసుకున్నాడు నన్ను. కాపురం పెట్టాం. నన్ను దారుణంగా హింస పెట్టేవాడు చందర్రావు. రిక్షాలో అమ్మాయిల్ని తీసుకొచ్చి నన్ను బయటి అరుగు మీద కూర్చోమని అమ్మాయిలతో పాటు లోపల గంటలసేపుండిపోయేవాడు. ఇక భరించలేక అతనితో విడిపోయి నర్స్ ట్రైనింగ్ అయ్యి ఈ హాస్పిటల్లో చేరాను.

ఒకరోజు అన్నపూర్ణా టాకీసులో రెండో ఆట సినిమాకెళ్ళేను. ఒకటే వర్షం. ఆట వదిలిన గంటయినా తగ్గడం లేదు వర్షం. చాలా మంది తడిసివెళ్ళిపోయేరు. నాకావేళ జ్వరం. తడిస్తే ఇంకా ఎక్కువవుద్దని భయపడి అలా నిలబడిపోయేను. నా దగ్గరకొచ్చిన ఒకతను వర్షం ఇప్పట్లో తగ్గేలాగ లేదు. నా బుల్లెట్టు బండి వెనకాల కూర్చుంటే మీ ఇంటికాడ దింపేస్తాను అన్నాడు.

అతని మాటా, తీరూ చాలా మృదువుగా ఉన్నాయి. ‘‘సరే’’ అనుకుని అతని బండెనకాల ఎక్కేను.

ఆ తర్వాత రెండుమూడు సార్లు కలిసేడు. అతని పేరు బడుగు క్రిష్ణారావట సోమేశ్వరం గుళ్ళో ఈవోగా పనిచేస్తున్నాడట. నా కథంతా విన్నాకా ఇంకా బాగా దగ్గరయ్యేడు. ఒక సాయంత్రం మావూరు వెళ్దామని బస్టాండ్లో నిలబడితే అక్కడికొచ్చిన క్రిష్ణారావు ‘‘నేనూ మీతో పాటు బస్సులో వస్తాను దార్లో మాటాడేపనుంది’’ అన్నాడు.

‘‘సరే రండి’’ అన్నాను.

బస్సు తాళ్ళపాలం దాటుతున్నప్పుడు చెప్పేడు. ‘‘మీకు చెప్పేనో లేదో నాకు పెళ్ళయింది ఇద్దరు పిల్లలు. మా ఆవిడ చాలా మంచిది నీగురించి మాటాడి మామిడాడగుళ్ళో నిన్ను పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను..ఏవంటావ్?’’ అన్నాడు.

ముందు చాలా కంగారుపడిపోయేను. తర్వాత తట్టుకున్నాను.

''ఏవంటావ్...ఏవంటావ్'' అని అతను కుదిపేస్తుంటే ''సరే'' అన్నాను. గొల్లలమామిడాడ తీసుకెళ్ళి పెళ్ళి చేసుకున్నాడు నన్ను. వాళ్ళావిడతో మట్టుకు ఇంకా చెప్పలేదట అంది మేరీకమల.

అక్కడ్నించి తిరిగొచ్చేసేను.

రాత్రంతా ఆలోచించేను.

రెండుసార్లు పెళ్ళిచేసుకున్న ఆ మనిషి వెనకాల బడ్డం కరెక్టా అని చాలాసార్లు అనుకున్నాను. కాదు అని ఓ పక్క అనిపిస్తున్నా తిరిగిమళ్ళా ఆ మనిషేకావాలనిపిస్తుంది. ఆ నవ్వూ ఆ పలకరింపూ కావాలనిపిస్తున్నాయి. ఆవిడ్ని మర్చిపోయి బతకడం నావల్ల కానిపని అనిపిస్తంది.

ఒకటి మట్టుకి అనుకున్నాను ఆ కమలకుమారి ఎన్ని పెళ్ళిళ్ళు చేసుకున్నా ఆ మనిషినాకు కావాలి అని. అంతే.

కారు నలుపు కమలకి తెలుపురంగంటే ఇష్టం...ఆకు సంపెంగలంటే ఇష్టం...స్నానం చేసేప్పుడు బిందెలకి బిందెలు నీళ్ళు పెత్తిపోసుకోడం ఇష్టం... పూరీల్లో బంగాళాదుంపల కూరంటే ఇష్టం. శారద సినేమాలో రేపల్లె వీచెను పాటంటే ఇష్టం.

ప్రతీరోజూ పూరీలపొట్లం పట్టుకెళ్ళి ఇస్తుంటే సగం నిద్రోతూనే తినేది రేపల్లె వీచెనో పాట పాడ్తుంటే ఎక్కడ నొచ్చుకుంటానో అని ఇబ్బంది పడతా వినేది. నీకు తెలుపంటే ఇష్టంగదా నీకు పండక్కి తెల్లచీర కొని తెస్తాను అని నేనంటే నా మోచేతి మీద చెయ్యేసి ''ఆడోళ్ళు చీర ముడేసి మూడునాలుగుసార్లు చుట్టి కుచ్చెళ్ళు దోపుకుంటారు గదా నేను మట్టుకు ముడేసాకా చుట్టుకోకండా నేనే గిరగిరా తిరుగుతాను తెల్సా'' అంది.

''ప్రతీరోజూ అంతేనా?'' అన్నాను.

''చీరకట్టుకోడం మొదలెట్టినప్పట్నించీ అంతే'' అనేది.

అలా కాస్సేపు గడిపేక నవ్వుతా కాస్త ఇబ్బందిగా చూస్తా ''నిద్రొస్తుంది'' అనేది.

నేనొచ్చేసేవాడ్ని.

కొన్నాళ్ళు గడిచిన తర్వాత ''పక్క పోర్షన్ వాళ్ళు ఏదేదో మాట్లాడుకుంటున్నారు. మన గురించి కృష్ణారావుగారికి తెలిస్తే బాగోదేమో'' అంది.

దాంతో నాకు చాలా కోపం వచ్చేసింది. ''నీకు ఆ క్రిష్ణారావుగాడెక్కువ నాకు నువ్వెక్కువ. నువ్వంటే మామూలు ఇష్టం కాదు చాలా ఇష్టం'' అంటా చాకుతో వేలు కోసేసుకున్నాను.

కంగారు పడ్డ మేరీకమల రక్తం కడిగి కట్టుకట్టి ''ఇలాంటి పనింకెప్పుడూ చెయ్యొద్దు నా మీదొట్టెయ్యి'' అని కౌగలించుకుంది.

* * *

ఒకరోజూ రామక్రిష్ణా హోటలు దగ్గర ఒకతను కలిసి టీ యిప్పించేడు. దయారత్నం అట పేరు. ''కమలతో నీకు పరిచయం ఉందట కదా?'' అన్నాడు.

''అవును'' అన్నాను.

''కమల నాకు బాగా తెల్సు. చక్కని మనిషి.. గొడవ పడి విడిపోయేం. నాదో రకం తత్వం ఒకసారి విడిపోతే మళ్ళీ కలవను. ఎప్పుడన్నా నా అవసరం వస్తే కబురు చెయ్యి అన్నాను. అయిదేళ్ళయింది. ఎలాంటి కబురూ లేదు. పౌరుషం తనకే కాదు నాకూ ఉంది. నేను కబురుచేసేదాకా ఆ మనిషిని కలవను... అంతే'' అని ఎవడో సైకిలేసుకొస్తే వెనకాలెక్కి వెళ్ళిపోయేడు.

ఇంకొకరోజు రాత్రి కిషోర్‌సెంటర్లో బసవరాజు లైట్ మ్యూజిక్ ప్రోగ్రాం జరుగుతుంటే నల్లగా నక్కలాగ కొంచెం పొట్టిగా వున్న చందర్రావు పరిచయమయ్యాడు. అతన్నిచూడ్డం అదే మొదటిసారి. కమల్ని మొదటపెళ్ళి చేసుకున్న మనిషి అతనే.

''కమలనీకు తెలుసట గదా?'' అన్నాడు.

''అవునన్నాను''.

ఏదో మాటాడ్తూ రెండుమూడు సిగరెట్లు కాల్చేడు. అతని మాటల్లో కమలగురించి చెడుగా మాటాడిందేదీ లేదు.

''ఇప్పుడు కాకినాడలో ఉంటన్నాను'' అనేసెళ్ళిపోయాడు.

ఆ తర్వాత కమల్ని కల్సినప్పుడు వాళ్లిద్దరిగురించి చెప్పేను.

నవ్వింది.

నోటికేదొస్తే అది మాటాడేను.

నవ్వింది తప్ప ఒక్కముక్క తిరిగి మాటాడ్లేదు మేరీ కమల.

''ఇంతమందితోటి ఇన్ని రకాల పరిచయాలున్న నీతో నాకెందుకిదంతా నీగురించి ఆలోచిస్తా నరకం అనుభవిస్తున్నాను రాత్రిళ్ళు. వద్దుబాబూ నీకో దణ్ణం'' అనెళ్ళిపోయేను.

కానీ,

ఆరాత్రి ఉండబట్టలేక పెద్ద ఉత్తరం రాసేను.

వెంటనే రమ్మని జవాబురాసింది కమల.

వెళ్ళేను.

నామీద పడి ఏడుస్తూ ''ఎందుకిలా బాధపెడ్తన్నావ్... నేను సుఖంగా వున్నానన్నా ఇలా ఏడిపిస్తున్నావ్'' అంది.

అదోలాగయిపోయేను వెంటనే.

స్టీల్‌గ్లాసులో టీ పోసిస్తూ ''మనం ఎక్కడికైనా పారిపోదాం అని నువ్వనేమాట నాకెంతిష్టమో తెల్సా'' అంది. ''నాకు చాలా ప్రోబ్లమ్స్ వస్తున్నాయి. వారానికోసారి మట్టుకు కలుద్దాం. ఈలోపు ఉత్తరాలు రాయి. నువ్వు నా ముందు మాటాడ్డం కంటే నువ్వు రాసే ఉత్తరాలే బాగుంటాయి నాకు మర్చిపోకేం'' అని సాగనంపింది.

నేను రాసే ఉత్తరాలు చీర మడతల్లో కలరా ఉండలు మధ్య పెట్టి, జాగ్రత్తగా దాచుకునేది.

తనుకూడా నాకు ఉత్తరాలు రాసేది అయితే తక్కువ.

* * *

నేను శ్రీకాకుళం దగ్గర నరసన్నపేట వెళ్ళేను.

అక్కడకూడా కమలగురించే ఆలోచించేవాడ్ని.

నాకు రకరకాల కలలు వస్తుండేవి. ఆ కలలో కాస్త వయసయిన నల్లటి రాజకుమారి వేషంలో దర్శనమిచ్చేది కమల. నన్ను తన పక్కన కూర్చోబెట్టుకుని ఎక్కడెక్కడికో తీసుకెళ్ళేది. ఆలోకాలు అంతకు ముందొచ్చిన నాకలల్లో నేనెరగని లోకాలు. అక్కడి మనుషులంతా కమలలాగే నవ్వుతా ఉండేవారు. అక్కడిగాలి మెత్తగా ఉంగరాలు తిరిగినట్టు వీచేది. అక్కడ కమలకిష్టమైన ఆకు సంపెంగపూల వాసనొచ్చేది. వాటితో పాటు మల్లెపూలంటే ఇష్టం కమలకి నాకేమో ఆమె జడలో నలిగిన మల్లెపూలిష్టం నేను వాటిని తెచ్చి సిగపాయలో గుచ్చినప్పుడు ''రేపల్లె వీచెనో పాట ఇప్పుడు పాడు'' అనేది.

* * *

శ్రీకాకుళంలోనూ ఆ తర్వాత ఒరిస్సాలోనూ మూడునెలలుండి పోయాను.

ఆరోజు ఊళ్ళోకొచ్చిన వెంటనే పిచ్చి తాతారెడ్డి షాపులో అద్దెసైకిలు తీసుకోవడానికి వెళుతుంటే గొల్లలతూము దగ్గర కోడిజుట్టు రాముా ఎదురై 'మేరీకమలకి ఇరవైనాలుగ్గంటల నెప్పొస్తే కాకినాడలో ఆపరేషన్ చేసేరు. ఆపరేషన్‌లో ఏదో తేడా వచ్చిందట... చీర కట్టుకుంటూ గిరగిరా తిరిగి మంచం మీద పడిపోయిన కమల ప్రాణాలు వెంటనే పోయాయట'' అని చెప్పేడు..

వెంటనే కాకినాడ బయల్దేరాను. స్మశానం ఎక్కడో తెలీదు. రోజంతా వెతికాను. తెలీలేదు అర్థరాత్రి లారీపట్టుకుని ఇంటికొచ్చేను.

కొన్నాళ్ళ తర్వాత ఒక వార్త తెల్సింది.

మేరీకమల ఉండే ఇల్లు ఖాళీ చేసి సామాన్లు వాళ్ళూరు కోటకి పంపిస్తున్న టైములో, ట్రంకు పెట్టెలో చీరమడతల్లో దాచిన నేను రాసిన ఉత్తరాలు బయటపడ్డాయి. వాటిని చదవిన బడుగు క్రిష్ణారావు ట్రాక్టర్‌ని కోటిపల్లికోటకి గాకండా, తన ఇంటికి తిప్పి సామాన్లు అక్కడ దించమన్నాడట.

ఈ విషయం తెలిసిన నేను 'మేరీకమలకి ఎంత అన్యాయం జరిగింది. నాతో ఏ సంబంధం లేకండానే ఎంత చెడ్డ పేరొచ్చింది. ఆ వుత్తరాలు రాయకండా ఉండాల్సింది'' అని ఏడ్చాను.

''మనం ఎక్కడికైనా పారిపోదాం'' అన్న నా మాట మేరీకమలకి చాలా ఇష్టం. జన్మజన్మలకీ ఇష్టం. నాకు చెప్పకండా శ్మశానానికి పారిపోయింది మేరీకమల. ఈ 72 కథల్లో ఇదొక్కటే స్వచ్ఛమైన సొంత స్టోరీ.

* * *